క్లుప్తంగా

ఎన్నికల కోడ్ కచ్చితంగా పాటించాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు జోగ్‌పాల్

పెద్దాపురం: ఎన్నికల నియమావళిపై అభ్యర్థులకు అవగాహన అవసరమని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రాజేష్ జోగ్‌పాల్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో బుధవారం పోటీలో ఉన్న అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, పోలీసు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారి జే.సీతారామారావు, డీఎస్పీ లతాకుమారి, ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

6న ఎక్సైజ్ వాహనాల వేలం

పెద్దాపురం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ వాహనాలను ఈ నెల 6వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ ఏవీవీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ రోజు ఉదయం 8 గంటల ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా దాడుల్లో పట్టుబడ్డ నాలుగు ద్విచక్ర వాహనాల బహిరంగ వేలంలో పాల్గొనే వారు తమ ఆధార్, పాన్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని ఆయన కోరారు. వాహనం దక్కించుకునే వారు జీఎస్టీ సొమ్మును కూడా జమ చేయాల్సి ఉంటుందని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

జనసేన రెబల్ అభ్యర్థి ఎన్నికల గుర్తు మార్పు

గోకవరం: జగ్గంపేట జనసేన రెబల్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర ఎన్నికల గుర్తును ఎన్నికల అధికారులు మార్చారు. ఇటీవల ఆయనకు గాజు గ్లాసు గుర్తును కేటాయించగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గాజుల గుర్తును కేటాయించినట్టు ఆర్వో శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

ప్రత్తిపాడు: ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని స్థానిక మినర్వా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డీవీఎస్ రమేష్ రాజు సూచించారు. ప్రత్తిపాడులో చెవల ఆనందకుమార్ జోషీ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ రితిష్ పాల్ చెవల ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మినర్వా చైర్మన్ మురళీకృష్ణ, హోప్ ఫౌండేషన్ చైర్మన్ మాసా ఇమ్మాన్యుయేల్, గుడాల సుందర్రావు, ఇంజనీర్ మోహన్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న దాత అక్షింతల రాజా, వైస్ ఎంపీపీ మైనర్‌బాబు

గోకవరం: మండలంలోని తంటికొండకు చెందిన దివ్యాంగుడు కొత్తపల్లి నాగేంద్రకు సనాతన ధర్మ ప్రబోధన సమితి ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు అక్షింతల రాజా సహకారంతో ట్రై సైకిల్‌ని వితరణ చేశారు. తంటికొండలో బుధవారం జరిగిన కార్యక్రమంలో దాత అక్షింతల రాజా, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు చేతుల మీదుగా రూ.12 వేలు విలువైన సైకిల్‌ను నాగేంద్రకు అందజేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, కొత్తపల్లి సత్యనారాయణ, పిల్లంగోరు పాపారావు పాల్గొన్నారు.

సాగు బాటకు యంత్రసాయం

- కూలీల కొరతకు చెక్ పెడుతూ సబ్సిడీపై యంత్రాల మంజూరు
- వ్యవసాయం దండగ అన్నవారికి గుణపాఠం

సామర్లకోట: వ్యవసాయం దండగ అన్నవాళ్లే కాదు పండగ అనేలా చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సాగు వ్యయం తగ్గించేలా యంత్రసాయం చేసి అన్నదాతలకు అండగా నిలిచారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి సబ్సిడీపై యంత్రాలు అందజేస్తున్నారు. కేవలం 10 శాతం నగదు చెల్లించి వరికోత యంత్రాలు, ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు అందుకునే అవకాశం కల్పించింది ప్రభుత్వం. ఈ యంత్రాలకు 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ, 50 శాతం బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తెలుసుకునేలా ప్రతి గ్రామంలో ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలో 43 కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా నాలుగు ఏళ్లుగా ఏడు గ్రూపులకు రూ.1.95 కోట్లు విలువైన రూ.61.6 లక్షల సబ్సిడీతో వరి కోత యంత్రాలు, 26 గ్రూపులకు రూ.2,09,40,139 విలువ కలిగిన ట్రాక్టరు, పవర్ టిల్లర్లు, కృషి ట్రాక్టర్లు రూ.74,32,800 సబ్సిడీతో అందజేశారు.

సున్నా వడ్డీతో రైతులకు రుణాలు

అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు సున్నా వడ్డీ రుణాలు ఇవ్వడం, రైతు భరోసా ద్వారా ఆర్థిక సాయం చేయడం, యంత్ర సాయం ద్వారా రైతులకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు.



సబ్సిడీ పవర్ టిల్లర్లు అందుకున్న రైతులు



వ్యవసాయ ట్రాక్టర్లు అందజేస్తున్న అధికారులు



వరి కోత యంత్రాలు అందుకున్న సామర్లకోట మండల రైతులు

సంఘంగా ఏర్పడడంతో మరింత బాధ్యత



రైతులు సంఘంగా ఏర్పడి యంత్రాలు తీసుకోవడం ద్వారా వారికి బాధ్యత పెరిగింది. యంత్రాల వినియోగం తరువాత వాటిని అద్దెకు ఇవ్వడం ద్వారా బ్యాంకు రుణాలు చెల్లించడానికి వీలవుతుంది.

– గొల్లపల్లి గంగాధరరావు, రైతు, వీకే రాయపురం

సబ్సిడీతో రైతులకు మేలు



ప్రభుత్వం సబ్సిడీతో యంత్రాలు అందజేయడం వల్ల రైతులపై భారం తగ్గుతుంది. ఆర్బీకేలో ట్రాక్టరు కోసం దరఖాస్తు చేసిన వెంటనే సిబ్బంది వచ్చి వివరాలు నమోదు చేసుకుని నెల రోజుల్లో అందజేశారు. బ్యాంకు రుణం వల్ల యంత్రాలకు బీమా సదుపాయం ఉంటుంది.

– తుమ్మల అచ్యుతరామయ్య, రైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

స్థానిక నాయకత్వానికి మద్దతు ఇవ్వాలి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- మోటారు యూనియన్ నాయకులతో సమీక్ష

సామర్లకోట: స్థానిక నాయకత్వానికి మద్దతు ఇచ్చి, ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం ద్వారా అందరికీ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడి దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు పాల్గొని మాట్లాడుతూ లారీ ఓనర్లు, డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు దొరబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పెదిరెడ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన ఆటో యూనియన్ సభ్యులను స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద కలుసుకుని వైఎస్సార్ సీపీ వల్ల ఆటో కార్మికులకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని, తాము ఫ్రీ బస్సు హామీ ఇవ్వలేదని పేర్కొన్నారు.

పార్టీలో టాక్సీ యూనియన్ అధ్యక్షుడి చేరిక

స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న టాక్సీ యూనియన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దొరబాబు పాల్గొన్నారు. యూనియన్ అధ్యక్షుడు దుర్గ, పితాని ప్రసాద్ తదితరులు దొరబాబు సమక్షంలో పార్టీలో చేరారు. టాక్సీ యూనియన్ కుటుంబ సభ్యులు వైఎస్సార్ సీపీకి మద్దతు ఇచ్చి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని దొరబాబు అభ్యర్థించారు. అనంతరం రైల్వే కాలనీలో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు. అలాగే సత్యనారాయణపురంలోని వ్యాన్ స్టాండ్ యూనియన్ కార్యాలయంలో కార్మికులను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు.

వైఎస్సార్ సీపీకి ఆర్యవైశ్యుల మద్దతు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబుకు పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు మద్దతు తెలియజేశారు. బుధవారం స్థానిక శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో సంఘ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి దొరబాబును ఆహ్వానించిన నాయకులు కటకం త్రిమూర్తులు, కటకం వీర్రాజు, కంచర్ల సత్యనారాయణ, కటకం సతీష్ ఆయనకు భరోసా ఇచ్చారు. దొరబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు రాజకీయంగా గుర్తింపు ఇస్తానని తెలిపారు. పంచారామ క్షేత్రమైన కుమారారామభీమేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పదవి మట్టపల్లి రమేష్‌కు ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అలాగే వాసవీమాత కల్యాణ మండపం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు దొరబాబును సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు కుసుమంచి శేషగిరిరావు (బాబీ), కటకం రాంబాబు తదితరులతో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, భారత మాత సేవాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్ కుమార్, కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆర్యవైశ్య సంఘ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు



సామర్లకోటలో ఆటో యజమానులను కలిసిన దవులూరి దొరబాబు

ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వాన్ని గెలిపించండి



కట్టమూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న దవులూరి దొరబాబు



నవర గ్రామంలో జెడ్పీటీసీ, చంద్రకళ, సార్వికల ప్రచారం

పెద్దాపురం: ప్రజా సంక్షేమం కోరే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. బుధవారం మండలంలోని కట్టమూరు, పట్టణంలో బంగారమ్మగుడి వీధి ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నల్లల గోవిందు, పెంటా విజయ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్; తాడి రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానుద్దేశించి దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తెరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి, ఎంపీటీసీ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

నవర గ్రామంలో దొరబాబు భార్య ప్రచారం

సామర్లకోట: మండల పరిధిలోని నవర గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు భార్య చంద్రకళ బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. సర్పంచ్ దమ్మాల లక్ష్మణరావు, సిద్దు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సిద్దు సుబ్బలక్ష్మి, దమ్మాల నాగమణి, చిక్కాల నూకరాజుల ఆధ్వర్యంలో ఆమె ఇంటింటా తిరిగి స్థానికుడైన దొరబాబును గెలిపించడం ద్వారా రాష్ట్రంలో రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకుందామని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనే చంద్రబాబు మేనిఫెస్టోగా ప్రకటించడం విడ్డూరంగా ఉన్నదన్నారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబుకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ, చంద్రకళ, సార్విక ప్రచారం

వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబుకు మద్దతుగా బుధవారం రాత్రి మండల పరిధిలోని నవర గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, దొరబాబు సతీమణి చంద్రకళ, కుమార్తె సార్విక ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామ సీనియర్ పార్టీ నాయకులు ఎలిశెట్టి నరేష్, అడపా శ్రీను, తోలెం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

గొల్లప్రోలు: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బుధవారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పరిశీలించారు. తాటిపర్తి, చినజగ్గంపేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లాఅధికార యంత్రాగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తాటిపర్తి జెడ్పీ హైస్కూల్ క్రీడా ఆవరణలో యువకులతో కలసి క్రికెట్ ఆడి వారిలో స్ఫూర్తిని నింపారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ ఎన్నికల్లో ఓటు వేసేలా భరోసా కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట గొల్లప్రోలు ఎస్సై బాలాజీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఏఎస్సైకి ఘనంగా వీడ్కోలు

ప్రత్తిపాడు: ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్సై శిరిగిరి బాబూరావును ప్రత్తిపాడు పోలీసు సిబ్బంది మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. సీఐ ఎం. శేఖర్‌బాబు, ఎస్సై ఎం .పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బాబూరావును పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అరుణ పతాకం రెపరెపలు

- ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం
- ఐక్యత చాటిన కార్మికులు

పిఠాపురం: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని (మే డే) బుధవారం పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వాడవాడలా అరుణ పతాకం రెపరెపలాడింది. గ్రామాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. కార్మికులు జెండాలను ఎగురవేసి వందనాలు సమర్పించారు. పిఠాపురంలో సీపీఎం కార్యాలయం, సీఐటీయూ కార్యాలయం, భవన నిర్మాణ కార్మికుల కార్యాలయాల్లో అరుణపతాకాలను ఆయా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. పిఠాపురం సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించిన వామపక్షాల నేతలు ఉప్పాడ బస్టాండ్ వద్ద సీఐటీయూ జెండాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో వామ పక్ష నేతలు కుంచే చిన్న, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, రమాప్రభ తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో..

సామర్లకోట: వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం మేడే ఘనంగా నిర్వహించారు. పట్టణ సీపీఐ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో సీపీఐ నాయకులు ఎలిశెట్టి రామదాసు, మడగల రమణ, మున్సిపల్ కార్మిక సంఘ అధ్యక్షుడు శ్రీనివాసు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మెహర్ కాంప్లెక్స్ నుంచి ర్యాలీ నిర్వహించారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక ఊరచెరువు సెంటర్ నుంచి ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అరుణ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస వేతనం కల్పించవల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వల్లూరి రాజబాబు, కుంచె అంజిబాబు, గంగా, కడితే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పెద్దాపురం మండలం పులిమేరు, ఆనూరు గ్రామాల్లో మేడే నిర్వహించారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పతాకావిష్కరణ చేసి భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, కడితి సతీష్, ముసిలిబాబు తదితరులు పాల్గొన్నారు. సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద చింతల సత్యనారాయణ, సినిమా సెంటర్‌లో నీలం శ్రీనుతో పాటు ఆయా వార్డు పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పతాకావిష్కరణలు నిర్వహించారు.

గొల్లప్రోలు: పట్టణంలో సీఐటీయూ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మేడే వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు ఓరుగంటి నందీశ్వరుడు జెండాను ఆవిష్కరించారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు, కార్మికులు



పులిమేరులో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రైతుకూలీలు



గొల్లప్రోలులో జెండాను ఆవిష్కరిస్తున్న కార్మికులు

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- కొత్తమూలపేటలో ఎన్నికల ప్రచారం



కొత్తమూలపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

కొత్తపల్లి: గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపిస్తాయని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత అన్నారు. మండలంలోని కొత్తమూలపేటలో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనూ లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆహ్వానిస్తున్నారని తెలిపారు. సీఎం జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేశారన్నారు. ఆయన చేసిన సంక్షేమమే 90 శాతం విజయానికి దోహదపడుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.సుగుణ, పెనుమల్లు కృష్ణారెడ్డి, కాటూరి చిన్నబ్బాయి, మాతా కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్



వైఎస్సార్ సీపీకి సంఘీభావంగా కరపత్రం విడుదల చేస్తున్న నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ పని చేస్తుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డోకుబుర్ర శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం కాతేటి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా మాదిగ, మాదిగ ఉపకులాలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీకి సంఘీభావంగా కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కొట్టుంగ రాజేష్, శ్రీమంతుల బాబ్జి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: మండల పరిధిలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎన్ ప్రభాకర్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట సబ్‌స్టేషన్ 33/11 కేవీ ఉప కేంద్రంలో 11 కేవీ పవర్ ఫీడర్ మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉండూరు, గొంచాల, పి.వేమవరం, కాపవరం, నవర, పవర, చంద్రంపాలెం గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

400 గ్రామాలను అభివృద్ధి చేస్తాం

- ఎంపీ అభ్యర్థి సునీల్ భార్య బిందు
- తన భర్తను గెలిపించాలని ప్రచారం



ఆర్బీ పట్నంలో ఓటు అభ్యర్థిస్తున్న చలమలశెట్టి బిందు

పెద్దాపురం: పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 400 గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని, ఈ దఫా ఎన్నికల్లో తన భర్త కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన సతీమణి బిందు ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం సాయంత్రం మండలం రాయభూపాలపట్నంలో పీఏసీఎస్ నాయకులు నల్లల నాగేంద్రబాబు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ మాట ఇచ్చి మడమ తిప్పని సీఎం జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఆయన చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సునీల్, పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బాధితులకు చేయూత

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో అగ్ని ప్రమాద బాధితులకు నాసా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చేయూతను అందించారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన చలగల సత్తెమ్మ కుటుంబానికి నాసా సంస్థ డైరెక్టర్ ఎస్.జ్యోతి ప్రేమదాస్ ఆధ్వర్యంలో బుధవారం బియ్యం, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో నాసా ప్రతినిధులు ఆర్.హేమలత, వి.దొంగబాబు స్థానికులు పి.సత్తిబాబు యు.రాంబాబు రమేష్ తదితరులు పాల్గొన్నారు.